పేదలకు రక్ష.. జగనన్న ఆరోగ్య సురక్ష

- సీఎం జగన్‌తోనే రాష్ట్రానికి మేలు
- ఏపీ మెడికల్ కౌన్సిల్ డైరెక్టర్ డాక్టర్ దిరిశాల వరప్రసాద్



ఏలూరు వైఎస్ఆర్ కాలనీలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సోమశేఖర్, వేదికపై ఏపీ మెడికల్ కౌన్సిల్ డైరెక్టర్ డాక్టర్ దిరిశాల వరప్రసాద్

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలోని ప్రతి పేదవానికీ మెరుగైన వైద్యసేవలను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారని ఏపీ మెడికల్ కౌన్సిల్ డైరెక్టర్ డాక్టర్ దిరిశాల వరప్రసాద్ అన్నారు. ఏలూరు 13వ డివిజన్ వైఎస్ఆర్ కాలనీ, వెంకటాపురం-4 సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ వరప్రసాద్ హాజరై వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ప్రజలకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తూ వైద్య సేవలు అందించేలా అధికారులకు సూచనలు చేశారు. ఏలూరు తహసీల్దార్ సోమశేఖర్ మాట్లాడుతూ ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని కోరారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా వైద్య రంగం మొత్తం గ్రామాల్లో ప్రజల వద్దకు వచ్చిందన్నారు. కార్యక్రమంలో 13వ డివిజన్ కార్పొరేటర్ అన్నపూర్ణ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు నీడికొండ నరేంద్ర, పార్టీ నాయకులు గూడూరు విజయ ప్రసాద్, డాక్టర్ కె.ప్రదీప్తి, డాక్టర్ ఆర్.రోహిత్, డాక్టర్ వి.భవ్యశ్రీ, వైద్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలకు ప్రభుత్వం చర్యలు

ఏలూరు గజ్జలవారి చెరువు యూపీహెచ్‌సీ వద్ద జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఏలూరు నగర పాలక సంస్థ కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆళ్ళనాని సారథ్యంలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద వర్గాలకు ఉచిత వైద్యాన్ని చేరువ చేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారని తెలిపారు. సుమారు 500 మందికి పైగా ప్రజలు వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుని, మందులను ఉచితంగా అందుకున్నారు. 7 రకాల పరీక్షలు చేయటంతో పాటు, ప్రతి వ్యక్తి ఆరోగ్య డేటాను కంప్యూటర్‌లో నిక్షిప్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఏలూరు క్లస్టర్-1 అధ్యక్షుడు, కార్పొరేటర్ సుంకర చంద్రశేఖర్, జేసీఎస్ క్లస్టర్-1 కన్వీనర్, వాణిజ్య విభాగం నాయకుడు మోటమర్రి సదానందం, కార్పొరేటర్లు సబ్బన శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, అసిస్టెంట్ కమిషనర్ బాపిరాజు, ఎంహెచ్‌వో డాక్టర్ మాలతి, పార్టీ నాయకులు నండూరి వేణుగోపాల్, వితల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జిల్లా కలెక్టర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు



జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు మొక్కను అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న జేసీ బి.లావణ్యవేణి

ఏలూరు(మెట్రో) : జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌కు బుధవారం జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి, పూల మొక్కను అందజేశారు. కలెక్టర్‌కు భగవంతుడు ఆయురారోగ్యాలతో పాటు, ఎల్లప్పుడూ సంతోషంతో కూడిన జీవితాన్ని ప్రసాదించాలని ఆమె ఆకాంక్షించారు. అలాగే జిల్లాలోని పలు శాఖల ఉన్నతాధికారులు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తనకు శుభాకాంక్షలు తెలిపినవారందరికీ కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు.

నేడు జాలిపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష

ఏలూరు రూరల్: ఏలూరు మండలం జాలిపూడి గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బి.ప్రణవి తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ శిబిరంలో ప్రభుత్వ వైద్యులతో పాటు ప్రైవేటు ఆసుపత్రులకు చెందిన ప్రముఖ వైద్య నిపుణులు సైతం సేవలు అందిస్తారని వివరించారు. రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేస్తారని ఎంపీడీవో పేర్కొన్నారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేత



కృష్ణా జిల్లా పెద అవుటపల్లి వెళ్లి నూలు శేషగిరిరావుకు పింఛన్ అందిస్తున్న గ్రామ సంక్షేమ కార్యదర్శి శామ్యూల్

పెదపాడు: ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి వద్దకు సచివాలయ ఉద్యోగి వెళ్లి పింఛను అందించారు. పెదఅవుటపల్లిలోని పిన్నమనేని సిద్దార్థ ఆసుపత్రిలో పెదపాడు మండలం తోటగూడెంకు చెందిన నూలు శేషగిరిరావు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తోటగూడెం గ్రామ సచివాలయ సంక్షేమ కార్యదర్శి పెనుమాల శామ్యూల్ రోగి పరిస్థితిని తెలుసుకుని ఆసుపత్రికి వెళ్లి బుధవారం పింఛను నగదును అందించారు. దీంతో లబ్ధిదారుడి కుటుంబ సభ్యులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు.

రామాంజనేయులు మృతి తీరని లోటు



ఏలూరు శనివారపు పేట వీవర్స్ కాలనీలో జరిగిన రామాంజనేయులు సంస్మరణ సభలో నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలా రామాంజనేయులు(71) మృతి చేనేత కార్మిక ఉద్యమానికి తీరని లోటని సంఘ జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆదిశేషు అన్నారు. స్థానిక శనివారపు పేటలోని వీవర్స్ కాలనీలో రామాంజనేయులు సంస్మరణ సభను బుధవారం నిర్వహించారు. సంఘ జిల్లా కమిటీ సభ్యుడు గుత్తి పోతురాజు అధ్యక్షతన జరిగిన సభకు ముందుగా ఆయన చిత్రపటానికి ఏలూరు చేనేత సహకార సంఘం మాజీ డైరెక్టర్ మాడా వెంకటేశ్వరరావు నూలుదండ వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదిశేషు మాట్లాడుతూ హిందూపురంలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ధర్మవరం పట్టు చీరలు పవర్ లూమ్స్‌పై తయారీకి నిరసనగా చేనేత కార్మికుల ఉద్యమ నేత కొరటాల సత్యనారాయణ నాయకత్వాన జరిగిన పోరాటాల్లో రామాంజనేయులు కలిసి పనిచేశారన్నారు. రాష్ట్రంలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న రిజర్వేషన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలని, ప్రభుత్వ శాఖలకు అవసరమైన వస్త్రాలను చేనేత నుంచి కొనుగోలు చేయాలని, సహకార సంఘాలకు రావాల్సిన బకాయిలను వెంటనే ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో చేనేత కార్మికులు పేరక చిన్న వెంకటేశ్వరరావు, ఎర్ర సాంబశివరావు, గుంటూరు సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రకుమార్ సేవలు అభినందనీయం



అల్లూరి ఇంద్రకుమార్‌ను సన్మానిస్తున్న సీఆర్ఆర్ విద్యాసంస్థల పాలక మండలి ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పరిశ్రమలు – శాస్త్ర రంగంలో పారిశ్రామికవేత్త అల్లూరి ఇంద్రకుమార్ చేస్తున్న సేవలు అభినందనీయమని సీఆర్ఆర్ విద్యాసంస్థల పాలక మండలి ప్రతినిధులు ప్రశంసించారు. పరిశ్రమలు – శాస్త్ర రంగంలో చేసిన విశేష సేవలకు గానూ ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్న సందర్భంగా ఇంద్రకుమార్‌ను బుధవారం ఏలూరు సీఆర్ఆర్ కళాశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఆర్ఆర్ విద్యాసంస్థల పాలక మండలి అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఇంద్రకుమార్ పారిశ్రామికవేత్తగా విజయవంతం అయ్యారన్నారు. కెమికల్ ఇంజినీరింగ్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఇంద్రకుమార్ 1993లో అవంతి ఫీడ్స్ సంస్థను స్థాపించి దాని ద్వారా పారిశ్రామిక రంగంలో అద్భుతమైన ఫలితాలు సాధించారన్నారు. 2017లో సుప్రసిద్ధ ఫోర్బ్స్ పత్రిక ద్వారా ఉత్తమ సీఈఓగా అవార్డును అందుకోవడం గర్వకారణమన్నారు. విద్యాసంస్థల నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పనలో ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో సీఆర్ఆర్ విద్యాసంస్థల పాలక మండలి ఉపాధ్యక్షులు వీవీ బాలకృష్ణారావు, ఏవీ సుబ్రహ్మణ్యం, కార్యదర్శి ఎంబీఎస్‌వీ ప్రసాద్, కోశాధికారి చిట్టూరి జానకిరామయ్య, సంయుక్త కార్యదర్శి కొడాలి వెంకట సుబ్బారావు, విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి



ఏలూరు మండలం కోటేశ్వరదుర్గాపురంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు వర్రీ నారాయణ

ఏలూరు రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని ఏలూరు మండలం కోటేశ్వర దుర్గాపురం సర్పంచ్ వర్రీ లక్ష్మీదుర్గ అన్నారు. గ్రామంలో రూ.55 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ గ్రామ నాయకుడు వర్రీ నారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎన్నడూ గ్రామాలకు కోట్ల రూపాయల నిధులను విడుదల చేసిన దాఖలాలు లేవన్నారు. దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి కృషితో గ్రామానికి సచివాలయం, విలేజ్ క్లినిక్, పాల కేంద్రం మంజూరైనట్లు తెలిపారు. నాడు నేడు పథకం నిధులతో పాఠశాల అభివృద్ధి చెందిందన్నారు. ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు సహకారంతో మండల పరిషత్ నిధులు ఖర్చుచేసి మాధవాపురం గ్రామానికి గ్రావెల్ రోడ్లు వేసినట్లు చెప్పారు. గడిచిన మూడేళ్ల పంచాయతీ పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించామని వైఎస్సార్ సీపీ నాయకుడు బాలకృష్ణ తెలిపారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలి



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ

దెందులూరు: స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నియోజకవర్గ ఎన్నికల అధికారి సత్యనారాయణ బుధవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కొవ్వలిలో డీఎల్‌ఓ ఓటు నమోదు, తొలగింపు ప్రక్రియలో కొందరి ఓట్లు తొలగిపోయాయన్నారు. అటువంటి వారికి ఈ నెల 26 నాటికి ఓటు హక్కు కల్పిస్తామన్నారు. ఎన్నికల విధులు నిర్వహణ సమయంలో ప్రతి ఉద్యోగి అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. సమావేశంలో ఇతర వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు పోకల రాంబాబు, పార్టీ నాయకులు గారపాటి కొండయ్యచౌదరి, ఇప్పిలి వెంకటేశ్వరరావు, దెందులూరు, పెదపాడు తహసీల్దార్లు ఎన్‌వీ నాంచారయ్య, విజయ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్లు ప్రియ, హరి ఉన్నారు.

6న పెదవేగిలో ఆటల పోటీలు

పెదవేగి : ఈనెల 6న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లా జట్ల ఎంపిక జరుగుతుందని జిల్లా కార్యదర్శి కె జయరాజు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పెదవేగి గురుకులంలో శుక్రవారం కుస్తీ, రగ్బీ పోటీలు బాలురు, బాలికలకు నిర్వహిస్తామని, త్రోబాల్, టెన్నికాయిట్ బాలురకు మాత్రమే నిర్వహిస్తామని ఆయన చెప్పారు. క్రీడాకారులు ఉదయం 9 గంటలకు పెదవేగి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో హాజరుకావాలన్నారు.

గౌతమి ఫ్యాక్టరీ కార్మికుల ఆందోళన



వంగూరులో ర్యాలీగా ఫ్యాక్టరీకి తరలి వెళ్తున్న కార్మికులు

ఏలూరు (టూటౌన్): వంగూరు గౌతమి ఆగ్రో ఎంఎస్ బయోటెక్ కంపెనీ కార్మికుల వేతనాలు పెంచాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సక్రమంగా చెల్లించాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ(ఇఫ్టూ) ఆధ్వర్యాన బుధవారం ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేపట్టారు. ప్రధాన రహదారి నుంచి ఫ్యాక్టరీ గేటు వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఇఫ్టూ అనుబంధ గౌతమి ఆగ్రో ఎంఎస్ బయోటెక్ ఇండస్ట్రీస్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు యు.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులకు ఏప్రిల్ ఒకటో తేది నుంచి వేతనాలు పెంచాల్సి ఉండగా యాజమాన్యం నేటికీ జాప్యం చేస్తోందని ఆరోపించారు. ఇప్పటికే పలుమార్లు ఆందోళనలు చేసినప్పటికీ యాజమాన్యం ముందుకు రాలేదని విమర్శించారు. అతి తక్కువ వేతనాలతో కార్మికులు పనిచేస్తున్నారని, రోజుకు కేవలం రూ.300 మాత్రమే చెల్లిస్తున్నారని ఆరోపించారు. కనీసం రూ.100 వేతనం పెంచాలని కోరారు. యాజమాన్యం కేవలం రూ.25 పెంచేందుకు ముందుకు వచ్చిందన్నారు. ఈ పెంపుదల ఏ మాత్రం సరైంది కాదనీ, రాను పోను చార్జీలకే రూ.70 నుంచి రూ.80 ఖర్చు అవుతోందని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ యూనియన్ అధ్యక్షురాలు వాడపల్లి పద్మ, ఎ.ఆలీసమ్మ, బెజవాడ పద్మ, ఎం.రంగమ్మ, అనసూయ, లిల్లీ పుష్ప, మోతీ భవాని, సావిత్రి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేనూ ఎంఎస్ ఆఫీస్ నేర్చుకున్నాను

జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

బుట్టాయగూడెం: తాను ఇంటర్ చదువుతున్న సమయంలో ఎంఎస్ ఆఫీస్ నేర్చుకున్నానని అది ఇప్పటికీ తనకెంతో ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. బుధవారం ఆయన బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల గ్రౌండ్‌లో మొక్కలు నాటారు. అలాగే విద్యార్థులను రక్తహీనత, పౌష్టికాహార లోపం గురించి అడిగి తెలుసుకున్నారు. కళాశాల వసతి గృహంలో అదనంగా మరో 150 మందికి డార్మిటరీ నిర్మాణానికి అనుమతిని మంజూరు చేశారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించాలని ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజను ఆదేశించారు. అదేవిధంగా కళాశాల సమీపంలోని స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణా తరగతులను కలెక్టర్ సందర్శించారు. శిక్షణ పొందుతున్న వారిని శిక్షణా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంఎస్ వర్డ్, ఎక్సెల్ కాలిక్యులేట్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో పూర్తి అవగాహన పొందాలని కలెక్టర్ సూచించారు. ఎంఎస్ ఆఫీస్ ఎక్కడికి వెళ్లినా ఉపయోగపడుతుందని చెప్పారు. తాను కూడా ఇంటర్ చదువుతున్న సమయంలో ఎంఎస్ ఆఫీస్ నేర్చుకున్నానని అది ఇప్పటికీ తనకెంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ పి.శ్రీపూజ, డీఎంహెచ్‌ఓ ఎస్.శర్మిష్ట, ఐసీడీఎస్ పీడీ విజయలక్ష్మి, ఆర్డీఓ ఎం.ఝాన్సీరాణీ, డీఈవో శ్యామ్ సుందర్, జెడ్పీ సీఈఓ కె.రవికుమార్, ఎంపీడీఓ వేణుగోపాలరెడ్డి, తహసీల్దార్ ఎస్.శారా శాంతి, సీడీపీఓ ఇ.తులసి, కళాశాల ప్రిన్సిపాల్ భక్తహనుమాన్, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీ కుక్కల వరలక్ష్మీ, సర్పంచ్‌లు మండకం రామలక్ష్మీ, తెల్లం వెంకాయమ్మ, సూపర్‌వైజర్ కంగాల ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం సందర్శన

బుట్టాయగూడెం-5 అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులు ఘన స్వాగతం పలికారు. అక్కడ ఉన్న గర్భిణీ కోనూరి స్వప్న ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు దుస్తులు, బ్యాగ్‌లు, బ్యాడ్జీలు పంపిణీ చేశారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	27
డీ.తిరుమల ఏలూరు బీహెచ్‌ఈఎల్	22.15	38
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	25
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	25
ఏలూరు బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	31
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	27
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	31
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర		
టమాటాలు	18	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	38	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	40
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	07-10
బెండకాయలు	20	కంద	40
పచ్చిమిర్చి	36	బీట్‌రూట్	38
కాకర కాయలు	20-28	కీరా దోస	50
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	110
క్యాబేజీ	24	అల్లం	120-240
క్యారెట్	38	కొత్తిమీర (కట్ట)	35
దొండకాయలు	24	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	32	తోటకూర	10
గోరుచిక్కుడు	36	గోంగూర	06
దోసకాయలు	24-28	పుదీనా	05
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40
		నిమ్మకాయలు (డజను)	--

సివిల్స్ కోచింగ్‌కు మానవత ఆర్థిక సాయం

పెదపాడు : గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకోవాలనే ధ్యేయంతో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కృషి చేస్తోందని రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు తెలిపారు. బుధవారం పెదపాడు మండలంలోని అప్పనవీడులో పెదవేగి మండలంలోని బోగాపురం గ్రామానికి చెందిన నిరుపేద రైతు కుటుంబానికి చెందిన యాళ్ల సాయిదేవికి సివిల్స్ కోచింగ్ నిమిత్తం మానవత విద్యానిధి నుంచి రూ.25వేలు, మానవత అప్పనవీడు యూనిట్ నుంచి రూ.19వేలు, ఘంటా సత్యనారాయణ ఇందిరాదేవి దంపతులు రూ.5వేలు, జయలక్ష్మి రూ.1000 మొత్తం రూ.50వేలు ఆర్థిక సాయం బుధవారం అందించారు. ఈకార్యక్రమంలో మానవత అధ్యక్షుడు కూరెళ్ల సుబ్బాచారి, సెక్రటరీ కల్లేపల్లి నారాయణరావు, కోశాధికారి వడ్డిరాజేశ్వరరావు, వేగిరెడ్డి సూర్యనారాయణ పాల్గొన్నారు.

క్షేత్రంలో పారిశుధ్య పనులు

ద్వారకాతిరుమల: జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు క్షేత్రంలో పారిశుధ్య ప్రత్యేక డ్రైవ్‌ను బుధవారం నిర్వహించారు. స్థానిక గుడిసెంటర్‌తో పాటు, క్షేత్రంలోని ప్రధాన కూడళ్లను, రహదార్లను శ్రీవారి దేవస్థానం స్వీపర్లు, అలాగే గ్రామ పంచాయతీ స్వీపర్లు ఉదయం 8 గంటల నుంచి శుభ్రం చేశారు. రోడ్లపై పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించారు.

మాంసం దుకాణాల్లో కాటాల సీజ్

ద్వారకాతిరుమల: స్థానిక మాంసం దుకాణాల్లోని ఎలక్ట్రానిక్ కాటాలను ఏలూరు లీగల్ మెట్రాలజీ అధికారులు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో అన్ని దుకాణాల్లోని కాటాలు తేడా ఉన్నట్టు గుర్తించారు. ఒక కేజీకి 100 గ్రాముల మాంసం తక్కువ తూగుతున్నట్టు గుర్తించామని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. 5 కాటాలను సీజ్ చేసి, దుకాణదారులపై కేసులు నమోదు చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

జూదరుల అరెస్ట్

జంగారెడ్డిగూడెం: పేకాట శిబిరంపై బుధవారం జంగారెడ్డిగూడెం పోలీసులు దాడులు చేశారు. వేగవరం తూర్పు పేటలో దాడులు చేసి పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేశామని ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. జూదరుల నుంచి రూ.2 వేలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

విర్డ్‌లో 114 మందికి వైద్య పరీక్షలు

ద్వారకాతిరుమల: స్థానిక శ్రీ వేంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ రిహ్యాబిలిటేషన్ ఫర్ ది డిజేబుల్డ్ (విర్డ్) ఆస్పత్రిలో ఈనెల 1 నుంచి 4 వరకు ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అమెరికాకు చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కామినేని శ్రీనాథ్ 114 మంది రోగులకు వైద్య పరీక్షలు జరిపి, అందులో అవసరమైన 18 మందికి విజయవంతంగా శస్త్రచికిత్సలు నిర్వహించారు. ఆస్పత్రి ట్రస్ట్ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ట్రస్ట్ సభ్యులు ఐవీఆర్ సుధాకర్, వి.నారాయణమూర్తిల ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో, తనతో పాటు వైద్యులు నాగేంద్ర, హమీద్, బాలాజీ, విహారి, సింధు, కె.శ్రీనివాస్ రోగులకు సేవలందించినట్టు డాక్టర్ ఎం.భవ్యచంద్ తెలిపారు.

ప్రతి పేద కుటుంబానికీ సొంతిల్లు కల్పించడమే లక్ష్యం



కొవ్వలిలో సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

పెదపాడు: ప్రతి పేద కుటుంబానికి సొంత ఇళ్లు నిర్మించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని, అర్హత కలిగిన ప్రతీ కుటుంబానికీ ఇంటి స్థలం, నిర్మాణానికి రుణం అందిస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు మండలంలోని వీరమ్మకుంటలో హౌసింగ్ అధికారులతో ఆమె గృహ నిర్మాణంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులను సమస్యలడిగి తెలుసుకుని అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించాలని సూచించారు. డీఈ రమాకాంత్, ఏఈ చైతన్య, స్థానిక సర్పంచ్ మరడాన చంటిబాబు, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, మాజీ సర్పంచ్ దాసరి పెదబాబు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి

దెందులూరు: ప్రజలకు ప్రయాణావసరాలు పూర్తిస్థాయిలో తీర్చేందుకు రహదారుల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అన్నారు. బుధవారం కొవ్వలిలో కళింగపేటలో జిల్లా పరిషత్ నిధులు రూ. 1.20 కోట్లతో రోడ్డు నిర్మించనున్న సీసీ రోడ్డును ఎమ్మెల్యే, జెడ్పీచైర్‌పర్సన్ ప్రారంభించారు. జెడ్పీటీసీ నిట్టాలీలా నవకాంతం గంగరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, దెందులూరు ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, మండల వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, సర్పంచ్ ఇంటేటి మధులత, సొసైటీ చైర్మన్ కొమ్మిన రాము, ఎంపీటీసీ గొరిపర్తి వరలక్ష్మి రంగారావు, గొల్ల వీరాస్వామి, నాయకులు, కార్యకర్తలున్నారు.

ELURU COLLEGE OF ENGINEERING
ELURU - 534 004, Approved by AICTE, Affiliated to JNTUK, website : www.ecet.ac.in
B.Tech SPOT ADMISSION : 2023-24 (EAPCET & ECET)
SPOT Admission will be Conducted for the not reported / Left over/dropout Seats after final phase of EAPCET-23, ECET-23, In Mentioned branches
(ECE, CSE, AI&DS, CSE:DS, EEE, MECH)
Note: Interested Candidates must attend for Spot Admissions on 5-10-2023 with All Original Certificates.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఏలూరు
99122 20559
95055 08399
96408 32693
Office mail : tpgadvt@gmail.com